క్లుప్తంగా

పక్కా గృహాలకు దరఖాస్తు చేసుకోండి

పెనగలూరు : మండలంలోని ప్రభుత్వ పక్కా గృహాలు కావాల్సిన వారు దరఖాస్తులు చేసుకోవాలని హౌసింగ్ ఏఈ హరిప్రసాద్ తెలిపారు. ఆధార్ కార్డులు, రేషన్ కార్డు జిరాక్స్, ఫోన్ నెంబర్‌ను నేరుగా పెనగలూరు హౌసింగ్ కార్యాలయంలో అందజేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల వారు సచివాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ దగ్గర దరఖాస్తు చేసుకోవాలన్నారు.

24న అయ్యప్పస్వామికి లక్షార్చన

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లిలో వెలసిన శ్రీ గోవిందమాంబ సమేత జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వాముల వారి దేవాలయ ప్రాంగణంలో ఈనెల 24న(ఆదివారం) అయ్యప్పస్వామి లక్షార్చన మహోత్సవ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు అయ్యప్పస్వామి పాద సేవకులు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివారం ఉదయం 5 గంటలకు అయ్యప్పస్వామి ప్రత్యేక పూజలు హోమాలు జరుగుతాయన్నారు. అలానే 8:30 గంటలకు లక్షార్చన పూజ, 11 గంటలకు పడి పూజ, 12 గంటలకు మంగళహారతి, తీర్థప్రసాద వినియోగం, తదుపరి అన్న ప్రసాద వితరణ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు, భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

ఆలయానికి శఠగోపం వితరణ



శఠగోపంను ధర్మకర్తలకు అందజేస్తున్న దాతలు

లక్కిరెడ్డిపల్లి : మండల కేంద్రంలోని విశ్వభారతి హైస్కూల్ సమీపంలో వెలసిన సర్వ మంగళ దేవి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయానికి లాయర్ ఎంఎల్ రామచంద్రారెడ్డి, గిరిజ దంపతులు, వారి కుమారుడు ఎంఎల్ చైతన్య రెడ్డి రూ. 50 వేలు విలువగల శఠగోపంను ఆలయ ప్రధాన అర్చకుల కొమ్మద్ది శ్రీహరిస్వామి, ఆలయ ధర్మకర్తలు గోర్ల మోహన్ రెడ్డి, భూదేవమ్మలకు శుక్రవారం అందజేశారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు



రోడ్లపై నిలిపిన వాహనాలను తీయిస్తున్న ఎస్ఐ శ్రీనివాసులు

సుండుపల్లె : మండల కేంద్రంలో వాహనాల రద్దీ అధికంగా ఉండటంతో తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుండగా శుక్రవారం సుండుపల్లి ఎస్ఐ శ్రీనివాసులు ప్రధాన రహదారులలోని షాపుల యజమానులకు తగు సూచనలు, సలహాలు చేశారు. రోడ్డుపై తమ వాహనాలను నిలపరాదని, అలాగే తోపుడు బండ్లపై కూరగాయలు, పండ్లు, ఫాస్ట్‌పుడ్ వంటివి రోడ్డుపై పెట్టి ట్రాఫిక్‌కు అంతరాయం కల్గించరాదన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కల్గించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ వెంకటరమణ, కానిస్టేబుల్, ప్రవీణ్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


మల్లూరమ్మకు అభిషేక పూజలు



ప్రత్యేక అలంకరణలో మల్లూరమ్మ

చిన్నమండెం : భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లిగా విరాజిల్లుతున్న శ్రీ మల్లూరమ్మకు వైభవంగా పూజలు జరిపారు. శుక్రవారం అమ్మవారికి అభిషేక పూజలు చేశారు. అంతకుముందు అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. సమీప ప్రాంతాల భక్తులు అమ్మవారిని దర్శించుకోగా వారికి ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న పీడీ నరేంద్ర

రామాపురం : జిల్లాస్థాయిలో నిర్వహించే త్రోబాల్ పోటీలకు మండలంలోని నీలకంఠ్రావుపేట జిల్లా పరిషత్ హైస్కూల్(తెలుగు) విద్యార్థులు ఎంపికైనట్లు పీడీ నరేంద్రకుమార్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ముక్కవారిపల్లి ఏపీ రెసిడెన్సియల్‌లో జరిగిన జిల్లాస్థాయి త్రోబాల్ ఎంపిక పోటీల్లో విద్యార్థులు నాగచైతన్య, పవనేష్, బాబు, స్టాండ్‌బైగా వెంకటరామయ్య, అండర్–17 విభాగంలో హర్షవర్ధన్‌లు జిల్లాస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయికి, జిల్లాస్థాయికి ఎంపిక కావడంతో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుజాతమ్మ, ఉపాధ్యాయుల బృందం హర్షం వ్యక్తం చేశారు.

ముంపుబాధలు ముగిసేదెన్నడు?

- గుంజనేరు రక్షణ గోడ నిర్మాణంలో కూటమి ప్రభుత్వం అలసత్వ వైఖరి
- రూ.38.52 కోట్లు కేటాయించిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- ఎన్నికలు పూర్తయ్యి 8 నెలలైనా ప్రారంభం కాని పనులు
- మరో ప్రమాదం జరుగకముందే పనులు పూర్తి చేయాలంటున్న ముంపువాసులు



గతంలో గుంజనేరు వరదల్లో కోతకు గురైన నరసరాంపేటలోని నివాస ప్రాంతం



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పనులు ప్రారంభానికి సంబంధించిన శిలా ఫలకం

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు పట్టణానికి చుట్టూ నాలుగు పక్కలా నరసరాంపేట, గాండ్లవీధి, ధర్మాపురం, కొత్తబస్టాండ్, కొత్తకోడూరు, కైకాల నగర్, అరుంధతివాడ, రంగనాయకులపేట, అంబేద్కర్‌నగర్ తదితర ప్రాంతాల వెంట పట్టణాన్ని గుంజనేరు విస్తరించి ఉంది. ప్రతి ఏటా వరద వచ్చిన సమయాలలో కోడూరుకి రక్షణ కరువైంది. భారీ వర్షాలు వచ్చినప్పుడు ఆయా ప్రాంతాలలోని ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవించాల్సిందే. దీనిని పరిగణనలోకి తీసుకొని వైఎస్సార్ హయాంలో కొత్త కోడూరుకు పడమర వైపు కొంత మేర ప్రొటెక్షన్ వాల్‌ను నిర్మించారు. తరువాత ముఖ్యమంత్రులుగా వచ్చిన రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి, చంద్రబాబులు ప్రజలు ఎంత మొర పెట్టుకొన్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. 2019లో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టాక ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, అప్పటి ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు కృషి చేసి ప్రొటెక్షన్ వాల్‌కు రూ.38.52 కోట్ల నిధులు, అదే గుంజనేరుపై రెడ్డివారిపల్లి బ్రిడ్జి నిర్మాణానికి రూ.16 కోట్ల నిధులు మంజూరు చేయించి నిర్మాణాల పనులు మొదలుపెట్టారు. అయితే ప్రభుత్వం మారడంతో పనులు రాజకీయ కారణాలతో ఆగిపోయాయి. గతంలో 2005, 2015, 19, 21 సంవత్సరాలలో వచ్చిన వరదలకు నరసరాంపేట, శాంతినగర్, గాంధీనగర్, ధర్మాపురం, ఆంజనేయస్వామి గుడివీధి తదిర ప్రాంతాలలో ప్రజలు నిద్రలేని రాత్రులు గడిపారు. వరదల్లో ఇప్పటి వరకు సుమారు 100కు పైగా ఇళ్లు కూలిపోయాయి. ఎందరో నిరాశ్రయులయ్యారు. ముఖ్యంగా నరసరాంపేట గ్రామస్తులు వర్షాలు కురిస్తే ఎప్పుడు ఏ పెను ప్రమాదం పొంచి ఉంటుందోనన్న భయాందోళనలో ఉండాల్సిన దుస్థితి నెలకొంది.

అడుగడుగునా నిర్లక్ష్యం

కోడూరుని వరద ముంపు నుంచి రక్షించే ప్రొటెక్షన్ వాల్ నిర్మాణ పనులను చేపట్టడంలో కూటమి ప్రభుత్వం, అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పట్టణంలోని ప్రజలు గుంజనేరు రక్షణ గోడ సత్వరం నిర్మించాలని కోరుకొంటున్నా దీని గురించి ఆలోచించేవారే కరువయ్యారు. ప్రతి ఏటా వర్షాకాలంలో గుంజనేరుకు దగ్గరలో నివాసముంటున్నవారు వరద వస్తుందేమోనని భయపడుతూ జీవనం సాగిస్తున్నారు. గుంజనేరు వర్షాకాలంలో ప్రతి ఏటా ప్రవహిస్తుంది. శేషాచలం అడవులు దగ్గరగా ఉండడంతో పదిరోజులకు మించి వర్షాలు పడ్డాయంటే అడవుల నుంచి వరదపోటు గుంజనేరు గుండా ప్రవహిస్తుంది. కోడూరు పట్టణానికి చుట్టూ గుంజనేరు ఉంది దీనివల్ల వరద ఎక్కువ అయితే ప్రమాదం అధికంగానే ఉంటుంది. దీనిపై అధికారులను వివరణ కోరగా పనుల ప్రారంభంపై పైస్థాయి నాయకులు, అధికారుల దృష్టిలో ఉందన్నారు. గతంలో ప్రారంభమైన పనులు ఎన్నికల వల్ల పనులు ఆగిపోయాయని, త్వరలో పనులు మొదలు పెడతామని అన్నారు. కానీ ఎప్పుడు మొదలు పెడతారో స్పష్టత లేకపోవడంతో ఈ ప్రాంతం వాసులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది



గుంజనేరు ప్రొటెక్షన్ వాల్ నిర్మాణం గురించి ప్రభుత్వం దృష్టికి స్థానిక ప్రజలు తీసుకెళ్లినప్పటికీ ప్రభుత్వం ప్రజల గోడు పట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. గత ప్రభుత్వం దీనిపై దృష్టిపెట్టి నిధులు మంజూరు చేసింది. అయినా కూటమి ప్రభుత్వం ఇంత వరకు పనులు మొదలుపెట్టలేదు.

– ఖన్నా, వార్డు మెంబర్, నరశరాంపేట, కోడూరు

వరదలకు ఇళ్లు కూలిపోయాయి



2021లో వచ్చిన గుంజనేరు వరదలకు నరసరాంపేటలో ఇండ్లు కోతకు గురై కూలిపోయాయి. దీంతో రెండువీధులలో వరద ప్రవహించింది. అధికారులు నిర్లక్ష్యం చేయకుండా చర్యలు తీసుకోవాలి. లేకుంటే వరదల దాటికి నరసరాంపేట గ్రామస్తులు తీవ్ర నష్టం చవిచూడాల్సి వస్తుంది.

– సీహెచ్ చంద్రశేఖర్, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు, రైల్వేకోడూరు

ప్రభుత్వం పనులు చేపట్టాలి



గత ప్రభుత్వంలో ఎంపీ మిథున్‌రెడ్డి, అప్పటి ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు కృషితో ప్రొటెక్షన్ వాల్‌కు రూ.38.52 కోట్ల నిధులు మంజూరయ్యాయి కొంత మేర పనులు కూడా జరిగాయి. ప్రభుత్వ మారాక ప్రొటెక్షన్ వాల్, బ్రిడ్జి పనులు నిలిచిపోయాయి. నాయకులు, అధికారులు తక్షణం పనులు ప్రారంభించాలి త్వరితగతిన పూర్తి చేయాలి.

– రామిరెడ్డి ధ్వజారెడ్డి, వైస్ ఎంపీపీ, రైల్వేకోడూరు

నేడు హౌసింగ్‌పై సమీక్ష

గాలివీడు : మండలంలోని గ్రామాల్లో ప్రభుత్వ గృహాల నిర్మాణంపై సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్షా సమావేశం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ అధ్యక్షతన శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు హౌసింగ్ ఏఈ రమేష్ బాబు తెలిపారు. ప్రతి ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఈ సమావేశానికి తప్పక హాజరుకావాలన్నారు. వారితోపాటు హౌసింగ్‌కు సంబంధించి గ్రామాల సమగ్ర సమాచారంతో రావాలన్నారు.

బహుమతుల ప్రదానం



విద్యార్థులకు బహుమతులు అందించిన ఫౌండేషన్ సభ్యులు, ఉపాధ్యాయులు

సంబేపల్లె : పర్యావరణ పరిరక్షణకు వ్యర్థ పదార్థాల సమగ్ర నిర్వహణ, ఇంకుడు గుంతల తవ్వకం ఎంతైనా అవసరమని ప్రధానోపాధ్యాయుడు నరసింహారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా విద్యార్థులు ఇంటింటికి వెళ్లి ఇంకుడు గుంతల తవ్వకంపై సర్వే నిర్వహించారు. సర్వేలో పాల్గొని ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏకలవ్య ఫౌండేషన్ ప్రతినిధి లక్ష్మయ్య, పాఠశాల కో–ఆర్డినేటర్ రెడ్డిశేఖర్, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, విజయబాస్కర్, దేవప్రసాద్‌రెడ్డి, రామయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రహరీ కూల్చినవారిపై కేసులు నమోదు చేయాలి



కూల్చి వేసిన శ్మశాన ప్రహరీని పరిశీలిస్తున్న కొరముట్ల, వైఎస్సార్‌సీపీ నాయకులు

పుల్లంపేట : పుల్లంపేటలోని సర్వేనెంబరు – 280 హిందూ శ్మశాన ప్రహరీ గోడను కూల్చిన వారిపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం కూల్చిన శ్మశాన ప్రహరీ గోడను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై తప్పుడు కేసులు బనాయించడం సిగ్గుచేటన్నారు. పుల్లంపేట శ్మశాన వాటిక ప్రహరీ గోడ కూల్చి వారం రోజులు అయినప్పటికీ రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం గాఢ నిద్రలో ఉన్నాయన్నారు. ముఖ్యంగా పోలీస్ వ్యవస్థ ఇలాంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని లేకుంటే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఇలాంటి నీచానికి పాల్పడిన వారికి కూటమి ప్రభుత్వం అండగా ఉండటం సిగ్గు చేటన్నారు. ఈ కార్యక్రమంలో పుల్లంపేట సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి, మండల కన్వీనర్ ముస్తాక్, రామనాథం, బికె మణి, రాంబాబు, ఎన్.పన్నీష్ కుమార్, వైఎస్సార్ సిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిబంధనల పాటింపుతో ప్రమాదాలకు చెక్



మాట్లాడుతున్న ఎంవీఐ వినోద్‌కుమార్

రాజంపేట టౌన్ : వాహనదారులు నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడిపితే రోడ్డు ప్రమాదాలు జరగవని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) బి.వినోద్‌కుమార్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం రహదారి భద్రతపై ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.పురుషోత్తం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐ పాల్గొని రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన అంశాలపై విద్యార్థులకు వివరించారు. ఈ ప్రపంచంలో అన్నింటికంటే విలువైనది ప్రాణం అన్నారు. వాహనాలు నడిపేటప్పుడు చిన్నపాటి నిర్లక్ష్యం వహించినా ఒకొక్కమారు జరగరాని ప్రమాదం జరుగుతుందన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని సూచించారు. ముఖ్యంగా చాలా మంది యువకులు వేగంగా వాహనాలను నడుపుతుంటారని, అది ఏమాత్రం శ్రేయస్కరం కాదన్నారు. అతివేగం కారణంగానే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. తల్లిదండ్రుల ఆశలన్ని పిల్లలపైనే ఉంటాయని, సరదా కోసమనో లేక తమకు డ్రైవింగ్ బాగా వచ్చన్న ధీమాతో యువకులు వాహనాలను వేగంగా నడపడం, వాహనాలను క్రాస్ చేయడం వంటివి చేసి ప్రాణాలమీదికి తెచ్చుకోవద్దని హెచ్చరించారు. ప్రతి వాహనదారుడు హెల్మెట్ తప్పక ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వెంకటనరసయ్య, అధ్యాపకులు డాక్టర్ ఎన్.చంద్రమోహన్, రవీంద్రబాబు, ఫిజికల్ డైరెక్టర్ మేజర్ విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడిదారులను ప్రోత్సహిస్తే సహించేది లేదు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

రాజంపేట టౌన్ : కార్పొరేట్లు, పెట్టుబడిదారులను ప్రోత్సహించి రైతాంగ కార్మికులకు అన్యాయం చేయాలని చూస్తే సహించేది లేదని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.రామాంజులు, ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్ తెలిపారు. రైతాంగ కార్మికులకు వ్యతిరేకంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న నిర్ణయాలను వ్యతిరేకిస్తూ ఈనెల 26న జిల్లా కలెక్టరేట్ వద్ద మహాధర్నా చేపట్టనున్నట్లు వారు తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం మహాధర్నా పోస్టర్‌ను సీఐటీయూ నాయకులు ఆవిష్కరించి మాట్లాడారు. రైతులకు గిట్టుబాటు కల్పించడంలో కేంద్రం విఫలం అయ్యిందన్నారు. కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ వెంటనే ఆపాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు సీహెచ్.ఓబయ్య, రమణ, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

'అవినీతి అధికారులను సస్పెండ్ చేయాలి'



మాట్లాడుతున్న సీపీఐ నేత విశ్వనాథనాయక్

రాయచోటి అర్బన్ : మున్సిపాలిటీలో అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న కమిషనర్ వాసుబాబు, సచివాలయం సెక్రటరీ రామమోహన్‌రెడ్డిలను వెంటనే సస్పెండ్ చేయాలని సీపీఐ రాష్ట్రసమితి సభ్యుడు బుక్కే విశ్వనాథనాయక్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సచివాలయం కార్యదర్శిగా కొనసాగుతున్న రామమోహన్‌రెడ్డి ఎలాంటి డిప్యుటేషన్ ఉత్తర్వులు లేకుండానే అనధికారికంగా మున్సిపల్ కార్యాలయంలో చక్రం తిప్పుతున్నారంటూ ఆరోపించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉన్నప్పటికీ ఆయనను హెల్త్ ఇన్‌స్పెక్టర్‌గా డిమోట్ చేస్తూ సచివాలయ ఉద్యోగిగా ఉన్న రామమోహన్‌రెడ్డితో ఏ విధంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగాన్ని చేయిస్తారంటూ ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా చెత్త పన్ను వసూలును ఆపివేస్తే రాయచోటిలో మాత్రం రామమోహన్‌రెడ్డి వ్యాపారుల వద్ద అనధికారంగా డబ్బులు వసూలు చేస్తున్నారంటూ ఆరోపించారు. క్లాప్ ఆటోల సూపర్‌వైజర్‌గా ఉన్న గోవింద నాయక్‌ను పక్కనపెట్టి రామమోహన్‌రెడ్డి ఆటోల రిపేర్లు, డిజిల్ కొనుగోలు తదితరాల పేరుతో రూ.20 లక్షలను తప్పుడు బిల్లులతో డ్రా చేశారంటూ ఆరోపించారు. మున్సిపాలిటీలో ఇంత తంతు జరుగుతున్నా కమిషనర్ ఎందుకు పట్టించుకోకడం లేదంటూ ఆయన నిలదీశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు విచారణ జరిపించి బాధ్యులను వెంటనే సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సుధీర్ కుమార్, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్రనేత శంకర్‌నాయక్‌లు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ వివరణ

సీపీఐ నేతల చేసిన ఆరోపణలపై మున్సిపల్ కమిషనర్ వాసుబాబు స్పందించారు. క్లాప్ డ్రైవర్ గోవిందనాయక్‌ను సూపర్‌వైజర్‌గా నియమించలేదన్న బాధతో తమపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఆటోల రిపేర్లు, డీజిల్ తదితరాలకు రూ. 20 లక్షలు బిల్లులు చేసుకున్నట్లు చెబుతున్నవి అసత్య ఆరోపణలు. ఇప్పటి వరకు రూ.3 లక్షలు మాత్రమే బిల్లులు పెట్టాం. హెల్త్ ఇన్‌స్పెక్టర్ బదిలీకావడంతో ఆయన స్థానంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సి.వి.రమణ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. ఆయనకు సహాయకారిగా రామమోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని పేర్కొన్నారు. అర్థం పర్థం లేని, నిరాధార ఆరోపణలు చేయడం తగదని పేర్కొన్నారు.

హెచ్చరిక బోర్డు తొలగించి ప్రభుత్వ భూమి కబ్జా

సిద్దవటం : మండలంలోని కనుమలోపల్లె వద్ద రెవెన్యూ అధికారులు ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డును తొలగించి, ప్రభుత్వ భూమిని చదును చేశారు. ఇంత జరుగుతున్న రెవెన్యూ అధికారులు, సిబ్బంది అటువైపు కన్నెత్తి కూడా చూడటంలేదని విమర్శలు వెలువెత్తుతున్నాయి. కనుమలోపల్లె రెవెన్యూ గ్రామంలో సర్వేనెంబర్ 70/3లో 70 సెంట్ల ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా హెచ్చరిక బోర్డును గతంలో రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేశారు. కొంత మంది భూ కబ్జాదారులు ఆ స్థలంలో రెవెన్యూ సిబ్బంది ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డును తొలగించి జేసీబీ సహాయంతో భూమిని చదును చేశారు.

జాబ్ మేళాకు స్పందన

రాయచోటి టౌన్ : పట్టణంలో జిల్లా స్థాయి జాబ్‌మేళాకు స్పందన లభించింది. శుక్రవారం రాయచోటి పట్టణంలోని మదనపల్లె రోడ్డులోని మోడెం చిన్నప్ప చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మోడం వీరాంజనేయప్రసాద్ ఈ జాబ్ మేళాను నిర్వహించారు. ఈ జాబ్ మేళాకు దాదాపుగా 200 మందికి అభ్యర్థులు హాజరయ్యారు. వీరిలో 35 మందికి అర్హత ఆధారంగా ఉద్యోగాలు కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి నాల్గవ శుక్రవారం ఇలాంటి జాబ్ మేళాను నిర్వహించి కొంతమందికైనా ఉద్యోగాలు కల్పించాలని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఎంపికైన వారికి నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జనరల్ సెక్రటరీ వెంకటరమణ గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ మోడం నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

మామిడి రైతులు సూచనలు పాటించాలి

సిద్దవటం : మామిడిలో సరైన సమయంలో పూత రావడానికి ఉద్యాన అధికారుల సూచనలు పాటించాలని ఉద్యాన అధికారి జయభరత్‌రెడ్డి తెలిపారు. మండలంలోని మాచుపల్లె, టక్కోలు, కడపాయపల్లె, లింగంపల్లె గ్రామాల పరిధిలోని మామిడి రైతులకు శుక్రవారం ఆయన మామిడిలో పూత సమయంలో పాటించాల్సిన చర్యలపైన మామిడి రైతులకు శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశారు. మామిడిలో ఒకేసారి పూత రావడం కోసం చేపట్టాల్సిన విధానాన్ని వివరించారు. తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. అధిక దిగుబడులకు ఐసీఏఆర్, ఐఐటీ చెన్నై వారు రూపొందించిన ఫైబల్స్ టెక్నాలజీని ఉపయోగించాలన్నారు.

ఘనంగా కోడూరు గంగమ్మ ఆలయ వార్షికోత్సవం



కలశాలను గ్రామోత్సవంగా తీసుకువస్తున్న భక్తులు

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు పట్టణంలోని కొత్తకోడూరు గంగమ్మ ఆలయ వార్షికోత్సవ పూజలను గ్రామస్తులు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ప్రత్యేకంగా భక్తులు 108 కలశాలతో గ్రామోత్సవం నిర్వహించి అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేదపండితులు అమ్మవారి హోమాలు, పూర్ణాహుతి చేసి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించారు.

సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తపడండి



సిద్దవటం సీహెచ్‌సీ ల్యాబ్‌ను తనిఖీ చేస్తున్న అధికారి మనోరమ

సిద్దవటం : కీటక జనిత వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జోనల్ మలేరియా అధికారి డాక్టర్ లక్ష్మణ్‌నాయక్ తెలిపారు. సిద్దవటం మండలంలోని పి.కొత్తపల్లె, మాధవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సిద్దవటంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను శుక్రవారం ఆయనతోపాటు మలేరియా అసిస్టెంట్ డైరెక్టర్ త్యాగరాజ్, జిల్లా మలేరియా అధికారిణి మనోరమలు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పలు రికార్డులను, ల్యాబ్‌లను పరిశీలించి మాట్లాడారు. సీజల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తపడాలన్నారు. రోగాల బారీన పడినవారికి రక్త నమూనా పరీక్షలు నిర్వహించి, చికిత్స అందించాలని సిబ్బందికి తెలియజేశారు. కార్యక్రమంలో మలేరియా సబ్‌యూనిట్ అధికారి సుబ్బరాయుడు, డాక్టర్‌లు ప్రకాష్, శివకుమార్, డాక్టర్ శ్రీవిద్య, ఎంపీహెచ్‌ఓలు శివశంకర్‌రెడ్డి, నిత్యపూజయ్య, నాగవల్లి, వైద్య సిబ్బంది తదిరతులు పాల్గొన్నారు.

వైభవంగా పడిపూజ

లక్కిరెడ్డిపల్లి : అయ్యప్ప దీక్ష ఆరోగ్య రక్ష అని గురుస్వాములు చెల్లు గంగరాజు, వెంకటేష్, గంగధర్ రాజు, సుధీర్ కుమార్, వేణు, బుజ్జి స్వాములు పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి మండలంలోని నామాల గుట్టపై వెలసిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో అయ్యప్ప స్వామి పడిపూజను చెల్లు గంగరాజు, వెంకటరమణ కుటుంబ సభ్యులు నిర్వహింపజేశారు. అయ్యప్ప భజనల్లో మాలాధారులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు శివశంకర్‌రెడ్డి, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

భద్రకాళికి రాహుకాల పూజ

రాయచోటి టౌన్ : రాయచోటి శ్రీ భద్రకాళీ అమ్మవారికి రాహుకాల పూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శుక్రవారం ఆలయంలో అమ్మవారికి అభిషేకాలు, పూజలు నిర్వహించి, అందంగా అలంకరించి భక్తుల దర్శన ఏర్పాటు చేశారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు రాహుకాల పూజల విశిష్టతను వివరించారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.